సాక్షి
విశాఖపట్నం

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



జేకేసీకి 239 వినతులు

జగనన్నకు చెబుదాం (జేకేసీ) కార్యక్రమంలో 239 వినతులు అందినట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. 8లో

స్కేటింగ్‌లో శ్రీహాన్ సత్తా



రాష్ట్రస్థాయి స్పీడ్ స్కేటింగ్ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖకు చెందిన స్కేటర్ శ్రీహాన్ రెండు కాంస్యపతకాలను సొంతం చేసుకున్నాడు. 8లో

స్వదేశీ ఉత్పత్తులు కొనుగోలు చేద్దాం



స్వదేశీ ఉత్పత్తులను యువత ఆదరించాలని నటి, యాంకర్ రష్మీ గౌతమ్ పిలుపునిచ్చారు. 8లో

ఛ్చ.. ఏం చేద్దాం!

- అధినేతను కలిసినా నిరాశే
- బాబ్జీ 'దక్షిణ' ఆశలకు గండి
- చీపురుపల్లి పోవాల్సిందేనని 'గంటా'కు స్పష్టం
- భీమిలి సీటు కోసం గంటా వేడుకోలు
- పీలా'కు అనకాపల్లి సీటు గోవిందా...
- బాబుపై మండిపడుతున్న నేతలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అధినేతతో సమావేశం తర్వాత హామీ లభిస్తుందనుకున్న టీడీపీ నేతలకు భంగపాటు ఎదురైంది. విశాఖ దక్షిణ, అనకాపల్లి, భీమిలి సీట్ల విషయంలో అధినేతను కలిసిన ముగ్గురు నేతలకు ఎటువంటి హామీ లభించలేదు. విశాఖ దక్షిణ సీటును ఆశించి క్షేత్రస్థాయిలో పనిచేసుకుంటున్న గండి బాబ్జీ సీటుకు గండిపడినట్టేనని తేలిపోయింది. ఇక అనకాపల్లి సీటు విషయంలో పీలా గోవింద్ ఆశలు వదులుకోవల్సిందేనని స్పష్టమైంది. గంటా శ్రీనివాసరావు చలో చీపురుపల్లి అనాల్సిందేనని చంద్రబాబు తేల్చిచెప్పినట్టు తెలుస్తోంది. అధినేతను కలిసిన తర్వాత హామీ వస్తుందనుకున్న నేతలకు ఊరడింపు మాటలు మినహా సీటు ఊసెత్తకపోవడంతో ఉసూరుమనుకుంటూ తిరుగుపయనమైనట్టు తెలుస్తోంది. తెలుగుదేశం-జనసేన సీట్ల ప్రకటనల అనంతరం అసమ్మతి నేతలకు స్పష్టమైన హామీ లభించకపోవడంతో తమ రాజకీయ భవిష్యత్‌పై ఎవరికివారుగా తమ అనుచరులతో భేటీ అయ్యేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

'దక్షిణ'పై ఆశలు వదులుకో?

గత ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యేగా టీడీపీ తరుపున గెలిచిన వాసుపల్లి గణేష్‌కుమార్ ఆ పార్టీ తీరు నచ్చకపోవడంతో దూరంగా ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన తీరును మెచ్చుకుంటూ ప్రభుత్వానికి మద్దతుగా ఉంటున్నారు. వాసుపల్లి దూరమైన తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎవరిని నియమించాలో తెలియని పరిస్థితి తెలుగుదేశం పార్టీలో నెలకొంది. కొన్నాళ్లకు గండి బాబ్జీని నియోజకవర్గ ఇన్‌చార్జిగా తీసుకువచ్చారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో గండి బాబ్జీ పర్యటిస్తూ వచ్చారు. ఇందుకోసం బాగానే ఖర్చు చేసినట్టు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో దక్షిణం నుంచి సీటు వస్తుందని మొన్నటివరకూ ఆశించారు. అయితే, పొత్తులో భాగంగా భీమిలితో పాటు విశాఖ దక్షిణ సీటును జనసేనకు ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో అప్రమత్తమైన గండి బాబ్జీ ముందుగానే పార్టీ పెద్దలను కలసి సీటు కోసం ప్రయత్నించారు. ఆదివారం విజయవాడలో చంద్రబాబును కలిసి సీటు కోసం ప్రయత్నించారు. అయితే, దక్షిణం సీటుపై ఆశలు వదిలేసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నట్టు తెలుస్తోంది. ఒకవేళ అవకాశం ఉంటే మాడుగుల నియోజకవర్గానికి పంపే అవకాశాన్ని పరిశీలిస్తానని మాత్రమే చెప్పినట్టు సమాచారం. అయితే, మాడుగుల నియోజకవర్గానికి వెళ్లనని ఆయన చంద్రబాబుకు చెప్పినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై తన అనుచరులతో గుమ్మనంగా బాబ్జీ సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం.

చీపురుపల్లి వెళ్లాల్సిందే..!

ఎన్నికలు జరిగిన ప్రతీసారి నియోజకవర్గాన్ని మార్చే అలవాటున్న గంటాకు... అదే తీరుతో గట్టి షాక్ ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. ఇందుకోసం ఏకంగా జిల్లానే మారుస్తూ చీపురుపల్లి నియోజకవర్గాన్ని గంటాకు చంద్రబాబు ఎంపిక చేశారు. గతంలో విశాఖ పర్యటన సందర్భంగా తనను రాకుండా చేసినప్పటికీ గంటా కిమ్మనకపోవడాన్ని మనసులో పెట్టుకున్న చంద్రబాబు... ఎన్నికల్లో గంటాకు షాక్ ఇచ్చేందుకు ఎప్పటి నుంచో వేచిచూస్తున్నారన్న అభిప్రాయం ఉంది. దీంతో ముందుగానే తమ మీడియాకు చీపురుపల్లికి గంటా అనే లీకులిచ్చింది. అయినప్పటికీ తనకు భీమిలి ఇవ్వాలని గంటా పట్టుబడుతుండగా... కుదరదని ఇప్పటికే చంద్రబాబు తేల్చిచెప్పారు. చివరి ఆశగా మరోసారి చంద్రబాబును గంటా కలిసి భీమిలి ఇవ్వాలంటూ వేడుకున్నట్టు తెలుస్తోంది.

అయితే చీపురుపల్లికి చలో అనాల్సిందేనని చివరాఖరి మాటగా బాబు స్పష్టం చేశారు. దీంతో ఏమీ చేయాలో పాలుపోక ఉసూరుమని గంటా ఉన్నట్టు తెలుస్తోంది. చీపురుపల్లికి వెళ్లి ఓడిపోవాలా? కిమ్మనకుండా పోటీ చేయకుండా గౌరవాన్ని కాపాడుకోవాలా అనే మీమాంసలో పడినట్టు సమాచారం. మొత్తంగా తెలుగుదేశం పార్టీలో రేగిన అసంతృప్తికి చంద్రబాబు ఎటువంటి మందుపూయకపోగా మరింత రెచ్చగొట్టినట్టే వ్యవహారశైలి ఉందన్న అభిప్రాయం ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది.

అనకాపల్లి... నో చాన్స్

అనకాపల్లి నియోజకవర్గంలో చాలా **రోజుల నుంచీ పార్టీ కో**సం పీలా గోవింద్ **పనిచేస్తున్నారు. తన సీ**టుకు వచ్చిన ఇబ్బందేమీ **లేదన్న ధీమాతో** ఉన్న పీలాకు కోలు**కోలేని దెబ్బ తగిలింది.** తొలి విడత జాబితా**లోనే అనకాపల్లి సీటు** జనసేన నుంచి కొణ**తాల రామకృష్ణకు ప్రక**టించడంతో పీలాకు **గట్టి షాక్ తగిలినట్లు** అయింది. దీనిపై **ఆయన అనుచరులు పా**ర్టీ తీరుపై అగ్గిమీద **గుగ్గిలమవుతున్నారు.** పీలాకు ఇవ్వకపోతే ఎవరికీ సహకరించే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. దీంతో పీలాను చల్లబరించేందుకు చంద్రబాబు కబురుపంపారు. అనకాపల్లి సీటును జనసేనకు ఇచ్చేశామని.. రాబోయే రోజుల్లో మంచి చేస్తామనే ఊరడింపుడు మాటలు చంద్రబాబు మాట్లాడినట్టు తెలుస్తోంది. దీంతో ఏమీ మాట్లాడకుండానే పీలా గోవింద్ వెనుదిరిగినట్టు సమాచారం. ఇదే విషయాన్ని ఆయన అనుచరుల వద్ద చెప్పగా.. తాడోపేడో తేల్చుకోవాల్సిందేనని వారు మాట్లాడినట్టు తెలుస్తోంది. మొత్తంగా అధినేతతో జరిగిన సమావేశం పీలాకు ఎటువంటి ఊరడింపు దక్కకపోగా మరింత రెచ్చగొట్టినట్టు అయ్యిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారోననే చర్చ సాగుతోంది.

పల్స్ పోలియో విజయవంతం చేయండి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలోని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమం మార్చి 3న నిర్వహించనున్నామని, విజయవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబరులో సోమవారం డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్లు, యూపీహెచ్‌సీ అధికారులతో పల్స్‌పోలియో కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిధిలోని 8 జోన్లలో గల 72 యూపీహెచ్‌సీలలోని 813 బూతులలో 36 ట్రాన్సిట్స్ ఉపయోగించి, ఐదేళ్లలోపు వయసు గల 1,17,687 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ముఖ్యంగా బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, పబ్లిక్ ప్రాంతాలు, రైతు బజార్లలో పల్స్‌పోలియో సిబ్బంది చిన్న పిల్లలకు చుక్కలు వేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని చిన్న పిల్లల తల్లిదండ్రులు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

నేడు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాక

మహారాణిపేట: కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మంగళవారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 11.30 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరినాలో ఇంటలెక్చువల్ మీట్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 1.30 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం వెళతారు.

ఒకటి వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

మహారాణిపేట: జిల్లాలో ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు జరగనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. ఎల్.డి.ఎం ఆధ్వర్యంలో వారోత్సవాల గోడపత్రికను సోమవారం ఆవిష్కరించారు. 2024 - 25 సంవత్సరానికి భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో జిల్లాలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాసరావు జేసీకి వివరించారు. కార్యక్రమంలో ఎల్.డి.ఎం, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

శ్రీశారదా పీఠాన్ని సందర్శించిన ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి



స్వామీజీ ఆశీస్సులు తీసుకుంటున్న రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి

పెందుర్తి: విశాఖ శ్రీశారదా పీఠాన్ని రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి సోమవారం సందర్శించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. ఇరువురు పలు అంశాలపై కాసేపు ముచ్చటించారు. ముందుగా పీఠ ప్రాంగణంలోని రాజశ్యామల అమ్మవారు, ఇతర దేవతామూర్తులకు ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు.

వీఎఫ్‌సీసీ అధ్యక్షుడిగా కాయల వెంకటరెడ్డి



వీఎఫ్‌సీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన కాయల వెంకటరెడ్డిని సన్మానిస్తున్న కార్యవర్గం

విశాఖ సిటీ: వైజాగ్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ అధ్యక్షుడిగా ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శిగా సిహెచ్.శ్రీనివాస రాజు, ఉపాధ్యక్షుడిగా ఆర్.వి.చంద్రమౌళిప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఎం.ఎస్.ఎన్.రాజు, కోశాధికారిగా ఎస్.ఆర్.గోపీనాథ్ నియమితులయ్యారు. ప్రముఖ స్టార్ మేకర్ ఎల్.సత్యానందం సభ్యులలో ఒకరిగా ఎన్నుకున్నారు. ఈ కొత్త ఆఫీస్ బేరర్లు రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కాయల వెంకటరెడ్డి మాట్లాడుతూ విశాఖను ఫిల్మ్ మేకింగ్, స్టూడియోలకు హబ్‌గా మార్చేందుకు వీఎఫ్‌సీసీలో తమ నూతన బృందం కృషి చేస్తుందని తెలిపారు.

నేటి నుంచి టెట్ పరీక్ష

విశాఖ విద్య: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్-2024) పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. జిల్లాలో 9 కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షలకు 37,556 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు ఒరిజినల్, జిరాక్స్ ప్రతి, ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకొని రావాలన్నారు. ప్రతీ రోజు మొదటి సెషన్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష సమయానికి గంట ముందు అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

'పది' పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ

జేసీ మయూర్ అశోక్



మాట్లాడుతున్న జేసీ అశోక్

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. పదో తరగతి పరీక్షలకు చేపట్టాల్సిన చర్యలపై కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులకు నగరంలోని జూబ్లీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతులకు హాజరైన జేసీ పలు సూచనలు చేశారు. మార్చి 18 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గుర్తించిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. సంబంధిత అధికారులు పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో డీఈవో ఎల్.చంద్రకళ, పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మురళీ మోహన్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య ఉద్యోగుల గ్రీవెన్స్

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం మంగళవారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డీఎంహెచ్‌వోకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని సంబంధిత ఉద్యోగులు వినియోగించుకోవాలన్నారు.

రోడ్లపై వ్యర్థాలు లేకుండా శుభ్రపరచండి

జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ

సీతంపేట : నగరంలో ప్రధాన రహదారులు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం ఆయన జోన్ - 3, 5 పరిధిలో 26, 14, 45, 48, 49, 50, 51 వార్డుల పరిధిలోని అక్కయ్యపాలెం, లలితానగర్, నరసింహనగర్, కైలాసపురం, గిరి ప్రదర్శన రోడ్, మాధవధార, మురళీనగర్, నేషనల్ హైవే, తాటిచెట్లపాలెం, గ్రీన్‌బెల్ట్ ప్రాంతాల్లో రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. లలితానగర్‌లో వసుంధర క్యాస్టల్ అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డుపై వ్యర్థాలను గమనించి ఆ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్లాప్ వాహనం ద్వారా ఇంటింటా చెత్త సేకరణ జరుగుతున్నప్పుడు రోడ్లపై వ్యర్థాలు ఎందుకున్నాయని ప్రశ్నించారు. తడి, పొడి హానికర వ్యర్థాలు ఇంటి వద్దనే వేరుచేసి క్లాప్ వాహనాలకు ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు నిర్దేశించిన ప్రదేశాల్లో విధులు నిర్వర్తించాలని సూచించారు. క్లాప్ వెహికల్స్ నిర్ణీత సమయానికే ఇళ్ల నుంచి చెత్త సేకరించే విధంగా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లు, ఏఎంవోహెచ్‌లను ఆదేశించారు. ఎంతోమంది పర్యాటకులు నగరానికి విచ్చేస్తున్నందున ప్రధాన రహదారులు పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించాలని,ఆయాప్రాంతాల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఫ్లోటింగ్ బ్రిడ్జ్ పటిష్టత పరిశీలనకే డీ లింక్

- మాక్ డ్రిల్ నిర్వహించేందుకు సందర్శకులను అనుమతించలేదు
- బ్రిడ్జ్ నుంచి వ్యూపాయింట్ విడదీసి పటిష్టతను పరిశీలించాం
- అది తెలియక తెగిపోయిందని సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారు
- సముద్ర ప్రవాహ తీవ్రత సమయంలో సర్వసాధారణంగా చేపట్టే ప్రక్రియ ఇది
- మెట్రోపాలిటన్ కమిషనర్ మల్లికార్జున



బ్రిడ్జ్ నుంచి ప్లాట్‌ఫాంను డీ-లింక్ చేసి మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

విశాఖ సిటీ: ఫ్లోటింగ్ బ్రిడ్జ్ పటిష్టతను పరిశీలించేందుకు చేపట్టిన ప్రక్రియపై ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారానికి తెగబడ్డాయి. బ్రిడ్జ్ నుంచి ప్లాట్‌ఫాంను డీ-లింక్ చేసి మాక్‌డ్రిల్ నిర్వహిస్తే.. ఫ్లోటింగ్ బ్రిడ్జ్ తెగిపోయిందని సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారానికి తెరలేపారు. విశాఖ పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంటే.. ప్రతిపక్షాలు మాత్రం అది చూసి ఓర్వలేక ఆ ప్రాజెక్టులపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నాయి. దానికి ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌పై చేసిన రాద్ధాంతమే నిదర్శనం. సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం పూర్తిగా అవాస్తవమని, సీసీ కెమెరాలో రికార్డ్ అయిన డీ-లింక్ చేస్తున్న దృశ్యాన్ని విడుదల చేశారు.

ఇతర రాష్ట్రాల్లో పరిశీలించాకే..

విశాఖలో పర్యాటకులను మరింత ఆకర్షించే విధంగా వీఎంఆర్‌డీఏ పీపీపీ విధానంలో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ఏర్పాటుకు గ్లోబల్ టెండర్లు ఆహ్వానించింది. ఇందులో సాయి మోక్షా షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సంస్థ దక్కించుకుంది. వీఎంఆర్‌డీఏకు ఏడాదికి రూ.15.3 లక్షలు ముందస్తు చెల్లింపుల ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టింది. కేరళ, కర్నాటక రాష్ట్రాల్లో విజయవంతంగా నడుస్తున్న ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌లను పరిశీలించారు. నిపుణులైన కార్మికులతో విశాఖలో సబ్‌మెరైన మ్యూజియానికి సమీపంలో బ్రిడ్జ్ ఏర్పాటు చేశారు. దాన్ని ఆదివారం రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.

సముద్ర కెరటాల తీవ్రత కారణంగా..

సోమవారం నుంచి సందర్శకులను బ్రిడ్జ్ పైకి అనుమతించాలని నిర్వాహకులు భావించారు. అయితే సముద్ర కెరటాల తీవ్రత ఎక్కువగా ఉండడంతో మూడు రోజుల పాటు సందర్శకులకు అనుమతి లేదని ముందుగానే ప్రకటించారు. ఈ క్రమంలో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ టీ జాయింట్ పటిష్టతను పరిశీలించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించాలని భావించారు. దీనిపై అధికారులకు సమాచారం అందించారు. బ్రిడ్జ్ నుంచి ప్లాట్‌ఫాంను డీ లింక్ చేసి అక్కడకు దగ్గరలో ఏర్పాటు చేసిన యాంకర్లకు దగ్గరగా జరిపి ఉంచారు. వాటి మధ్యలో కనిపించిన ఖాళీ ప్రాంతాన్ని ఫొటో తీసి టీడీపీ నాయకులు ఫ్లోటింగ్ బ్రిడ్జ్ తెగిపోయిందని దుష్ప్రచారం చేశారు.

మాక్ డ్రిల్‌లో భాగంగా..

ఫ్లోటింగ్ బ్రిడ్జ్ పటిష్టతను పరిశీలించేందుకే బ్రిడ్జ్ నుంచి ప్లాట్‌ఫాంను డీ లింక్ చేశామని జిల్లా కలెక్టర్, మెట్రోపాలిటన్ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్పష్టం చేశారు. మాక్ డ్రిల్‌లో భాగంగా ఫ్లోటింగ్ బ్రిడ్జ్ పటిష్టతను పరిశీలించేందుకే నిర్వాహకులు బ్రిడ్జ్ నుంచి ప్లాట్‌ఫాంను విడదీసినట్లు చెప్పారు. దీనికి ఫ్లోటింగ్ బ్రిడ్జ్ తెగిపోయిందని సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని తెలిపారు. ఇది పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పారు. వాతావరణంలో మార్పులు కారణంగానే సోమవారం సందర్శకులను అనుమతించలేదని వివరించారు. ప్రతి నెలా పౌర్ణమి, అమావాస్య సమయాల్లో సముద్రంలో ఆటుపోట్లు ఉంటాయని, ఆ సమయాల్లో సాంకేతిక పరిశీలనలో భాగంగా సర్వసాధారణంగా చేపట్టే ప్రక్రియ ఇది అని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ఎప్పటికప్పుడు పటిష్టతను పరిశీలించేందుకు మాక్‌డ్రిల్స్ చేపట్టడం జరుగుతుందన్నారు. సోమవారం రాత్రి ఫ్లోట్ బ్రిడ్జ్‌ను వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర సందర్శించారు.

మూడు మిలియన్ల దిశగా..!

- కోవిడ్ ముందు స్థితిని అధిగమించనున్న విశాఖ ఎయిర్‌పోర్టు
- ఈ ఏడాది 25.10 లక్షల మంది ప్రయాణికుల రాకపోకలు
- ఏప్రిల్ నాటికి 30 లక్షలకు చేరుకునే అవకాశం



సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల తాకిడిలో దూసుకెళ్తోంది. రోజు రోజుకూ పెరుగుతున్న ప్రయాణికులతో కోవిడ్‌కు ముందున్న పరిస్థితిని అధిగమిస్తోంది. అంతేకాదు.. మరో రెండు మూడు నెలల్లో మూడు మిలియన్ల (30 లక్షల) మైలురాయికి చేరుకోనుంది. ఇప్పటివరకు ఎయిర్‌పోర్టు నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా 28.54 లక్షల మంది రాకపోకలు సాగించారు. ఇదే ఇప్పటివరకు రికార్డు. అందువల్ల 30 లక్షల మందికి చేరుకుంటే ఈ విమానాశ్రయం సరికొత్త రికార్డును సొంతం చేసుకోనుంది. ఈ ఏడాది (2023-24) జనవరి వరకు 25.17 లక్షల మంది వచ్చి వెళ్లారు. నెలకు సగటున 2.50 లక్షల మంది ప్రయాణిస్తున్నారన్న మాట! ఈ లెక్కన రానున్న రెండు నెలల్లో అంటే.. ఏప్రిల్ నాటికి 30 లక్షల సంఖ్యను అధిగమించనుంది. ఇక గడచిన పదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే.. ప్రయాణికుల సంఖ్య రెండున్నర రెట్లు పెరిగింది. ఈ ఎయిర్‌పోర్టు నుంచి 2014-15లో 10,97,566 మంది రాకపోకలు సాగించగా ఈ ఏడాదికి అది 25.17 లక్షలకు చేరింది. ఇక సంవత్సరాల వారీగా చూస్తే 2015-16లో 18,07,389 మంది, 2016-17లో 23,59,234 మంది, 2017-18లో 24.81 లక్షలు, 2018-19లో 28.54 లక్షల మంది రాకపోకలు సాగించారు. ఆ తర్వాత 2019-20లో కోవిడ్ ప్రభావంతో 26.91 లక్షలకు తగ్గింది. 2020-21లో 11.14 లక్షలకు పడిపోయింది. 2021-22 నుంచి మళ్లీ పుంజుకుంటూ ఆ ఏడాది 16.31 లక్షలకు, 2022-23లో 25 లక్షలకు, 2023-24లో 25.17 లక్షలకు చేరుకుంది. అలాగే 2014-15లో 11,306 విమాన సర్వీసులు నడవగా 2022-23కు 21,032, ఈ ఏడాది జనవరికి 18,613 సర్వీసులకు పెరిగాయి.

పెరుగుతున్న విమాన సర్వీసులు

ఒకవైపు ప్రయాణికుల రద్దీ పెరుగుతుండగా, అందుకనుగుణంగా విమానయాన సంస్థలు తమ సర్వీసులను పెంచేందుకు ముందుకొస్తున్నాయి. దేశీయ (డొమెస్టిక్) సర్వీసులతో పాటు అంతర్జాతీయ విమాన సర్వీసులు కూడా పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టు నుంచి సింగపూర్‌కు ఒక్కటే అంతర్జాతీయ సర్వీసు నడుస్తోంది. ఏప్రిల్ 9 నుంచి బ్యాంకాక్‌కు, 26 నుంచి కౌలాలంపూర్‌కు కొత్తగా విమాన సర్వీసులు (వారంలో మూడు రోజుల చొప్పున) ప్రారంభం కానున్నాయి. మరో మూడు, నాలుగు నెలల్లో దుబాయ్‌కు విమాన సర్వీసు నడపడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈనెల 9న హైదరాబాద్‌కు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసు ప్రారంభమైంది. మార్చి నెలాఖరుకు నేవీ చేపడుతున్న రన్‌వే రీ-సర్ఫేసింగ్ పనులు పూర్తవుతాయి. ఏప్రిల్ తర్వాత నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరులకు మరో ఐదు డొమెస్టిక్ సర్వీసులు ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

గత పదేళ్లుగా విశాఖ విమానాశ్రయానికి ప్రయాణికుల రాకపోకలు

సంవత్సరం	డొమెస్టిక్ సర్వీసులు	దేశీయ ప్రయాణికులు	విదేశీ సర్వీసులు	విదేశీ ప్రయాణికులు	మొత్తం ప్రయాణికులు
2014-15	10,913	10,69,166	393	28,400	10,97,566
2015-16	16,125	17,19,373	930	88,016	18,07,389
2016-17	19,243	22,93,187	696	66,047	23,59,234
2017-18	18,690	23,79,784	1,004	1,01,917	24,81,701
2018-19	23,074	27,32,488	1,078	1,21,630	28,54,118
2019-20	20,436	25,66,115	1,183	1,25,466	26,91,581
2020-21	10,912	11,07,100	89	7,604	11,14,704
2021-22	15,773	16,28,335	91	2,981	16,31,316
2022-23	20,526	24,35,618	506	65,171	25,00,789
2023-24 (జనవరిదాకా)	18,192	24,56,238	421	61,565	25,17,803

సదుపాయాలు సమకూరుస్తున్నాం..



పెరుగుతున్న ప్రయాణికుల దృష్ట్యా ఈ ఎయిర్‌పోర్టులో మరిన్ని సదుపాయాలను సమకూరుస్తున్నాం. కొద్దిరోజుల క్రితం ఎగ్జిక్యూటివ్ లాంజ్‌ను ప్రారంభించాం. చెక్ ఇన్ కౌంటర్లు 20 నుంచి 30 పెంచాం. అరైవల్, డిపాచర్ టెర్మినల్ వద్ద మనీ ఎక్స్ఛేంజి కౌంటర్లను ఏర్పాటు చేశాం. త్వరలో డిజి యాత్ర యాప్ అందుబాటులోకి వస్తుంది. సెక్యూరిటీ వేగవంతానికి ఎక్స్‌రే మిషన్లు ఏర్పాటు చేస్తాం. లగేజి సత్వర చేరవేతకు ఇంటర్నల్ బ్యాగేజి హ్యాండ్లింగ్ సిస్టమ్ త్వరలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం.

– ఎస్.రాజారెడ్డి, డైరెక్టర్, విశాఖ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు.

క్లుప్తంగా

అంతర్ కళాశాలల క్రికెట్ విజేత ఏఎంసీ

విశాఖ స్పోర్ట్స్: డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ హెల్త్ స్టడీస్ అంతర్ కళాశాలల టోర్నీలో ఏఎంసీ విజేతగా నిలిచింది. రాజమండ్రిలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఈ పోటీలు జరిగాయి. ఫైనల్స్‌లో ఆతిథ్య కళాశాల జట్టుపై టాస్ గెలిచి తొలుత ఏఎంసీ బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 119 పరుగులు చేసింది. ప్రతిగా జీఎస్ఎల్ జట్టు ఎనిమిది వికెట్లు కోల్పోయి 109 పరుగులే చేయగలిగింది. జట్టుకు కెప్టెన్‌గా అభిషేక్ వ్యవహరించాడు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు, స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.సునీల్‌కుమార్ అభినందించారు.

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

సీతంపేట: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ తెలిపారు. రామాటాకీస్ సమీపం కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణా ట్రావెల్స్ మేడపైన ఉన్న సంస్థ కార్యాలయంలో మార్చి 1 నుంచి ఏప్రిల్ 30 వరకు శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని వెల్లడించారు. శిక్షణ కోసం ఎటువంటి ఫీజు చెల్లించనక్కరలేదని, ఆసక్తి గల గృహిణులు ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 80193 88999లో సంప్రదించవచ్చు.

ఎస్‌ఐపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

బీచ్‌రోడ్డు: మద్యం మత్తులో మూడో పట్టణ ఎస్ఐపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఎస్ఐ మనోహర్‌ను మద్యం మత్తులో ఉన్న మణికంఠ ఆపి.. తిట్ల పురాణం అందుకున్నాడు. దీంతో ఎస్ఐ.. మణికంఠపై మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మందుబాబుపై సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ డ్రైవర్లు.. రియల్ హీరోలు

- మూడు దశాబ్దాలకు పైగా ఒక్క ప్రమాదమూ చేయని డ్రైవర్లు
- ఆర్టీసీ విశాఖ రీజియన్‌లో ముగ్గురు ఎంపిక
- వారికి నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు



జాతీయ అవార్డును అందుకుంటున్న రాజు

సాక్షి, విశాఖపట్నం: వాళ్లు మూడు దశాబ్దాలకు పైగా డ్రైవర్ వృత్తిలో ఉన్నారు. ఒక్క ప్రమాదమూ చేసి ఎరుగరు. ఇటు మనుషుల ప్రాణాలకు ముప్పు గాని, అటు ఆర్టీసీ సంస్థ బస్సులకు నష్టాన్ని గాని తెచ్చిన పరిస్థితి లేదు. జీరో ప్రమాదాల హీరోలుగా అందరి మన్ననలు పొందుతున్నారు. సాటి డ్రైవర్లకు ఆదర్శంగా నిలిచారు. డ్రైవింగ్ వృత్తిలో ఉన్న వారు ప్రమాదాలు చేయడం సర్వసాధారణంగా జరుగుతుంది. అయితే నిత్యం రద్దీలో వందల కిలోమీటర్ల దూరం బస్సు నడుపుతూ, 20–30 ఏళ్లకు పైగా విధి నిర్వహణలో ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా నడపడమంటే అంత తేలిక కాదు. ప్రమాదాలకు తావివ్వకుండా బాధ్యత, నిబద్ధతలతో నడిపే వారు అత్యంత అరుదుగా ఉంటారు. ఏపీఎస్ఆర్టీసీలో ఇలాంటి వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటోంది. ఏటా వీరిని గుర్తించి అవార్డులు, రివార్డులతో సత్కరించడం రివాజుగా వస్తోంది. ఈ ఏడాది విశాఖ జిల్లా నుంచి నలుగురు ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్లుగా ఎంపిక చేశారు. వీరిలో ఒకరు జోనల్, మరో ముగ్గురు రీజనల్ స్థాయిలో ఉన్నారు. జోనల్ స్థాయిలో మొదటి ఉత్తమ డ్రైవర్‌గా సింహాచలం డిపోకు చెందిన ఎస్ఏఎస్ రాజు, రీజనల్ స్థాయిలో కేవై నాయుడు (వాల్తేరు), ఎస్.తాతయ్యలు (గాజువాక), కేఎం రావు (స్టీల్ సిటీ) మొదటి, ద్వితీయ, తృతీయ ఉత్తమ డ్రైవర్ అవార్డులను సొంతం చేసుకున్నారు. ఇటీవలే వీరు ఈ అవార్డులను అందుకున్నారు. తాము ఇన్నేళ్లుగా ప్రమాదాలకు ఆస్కారం లేకుండా విధులు నిర్వహించడానికి అంకితభావం, క్రమశిక్షణ, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండడం వంటివి ప్రధాన కారణాలని చెబుతున్నారు. ఆర్టీసీలో బస్సుకు చిన్నపాటి గీత పడినా అది యాక్సిడెంట్‌గా రికార్డులకెక్కుతుంది. అయితే ఈ డ్రైవర్ల కెరీర్‌లో అలాంటి చిన్న ప్రమాదాలు నమోదు కాకపోవడం విశేషం!

ప్రయాణికుల రక్షణే బాధ్యతగా



ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చడం డ్రైవర్‌గా నా బాధ్యత. 36 ఏళ్ల నుంచి జాగ్రత్తగా ప్రమాదాలు జరగకుండా విధులు నిర్వహిస్తున్నాను. ఇంట్లో సమస్యలను పక్కనబెట్టి ఒత్తిడికి లోనుకాకుండా డ్రైవింగ్ పైనే దృష్టి సారిస్తాను. సాటి డ్రైవర్లకు జోనల్ ఆఫీసులో డ్రైవింగ్‌లో మెలకువలపై శిక్షణ ఇస్తుంటాను. ఇప్పటివరకు నాకు 25 ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్ అవార్డులొచ్చాయి. వీటిలో రాష్ట్ర స్థాయితోపాటు జాతీయ స్థాయి అవార్డు ఉంది.

– ఎస్ఏఎస్ రాజు, జోనల్ ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్, సింహాచలం డిపో

సెల్‌ఫోన్‌కు దూరంగా..



సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం కూడా ప్రమాదాలకు కారణం. అందుకే నేను డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు సెల్‌ఫోన్‌ను సైలెంట్ మోడ్‌లో ఉంచుతాను. పరిమిత వేగంతోనే బస్సు నడుపుతాను. విధి నిర్వహణలో బస్సు నడపడం పైనే దృష్టి పెడతాను. 34 ఏళ్ల నా సర్వీసులో ఇప్పటి వరకు ఒక్క ప్రమాదం కూడా జరగలేదు. ఇప్పటి దాకా నాకు ఆరు ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్ అవార్డులొచ్చాయి. మరో ఏడాదిలో పదవీ విరమణ చేస్తాను.

–కేవై నాయుడు, రీజనల్ ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్, వాల్తేరు డిపో

వయోవృద్ధులకు ఉపకరణాలు

నేటి నుంచి గుర్తింపు శిబిరాలు

ఏయూక్యాంపస్: రాష్ట్రీయ వయో శ్రీ యోజన పథకంలో భాగంగా కొత్తవలస సమీపం మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 60ఏళ్లు పైబడిన మహిళలు, పురుషులకు వివిధ ఉపకరణాలు అందిస్తారని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకులు మాధవి తెలిపారు. వృద్ధులకు అవసరమైన వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్, వాకింగ్ స్టిక్స్, ట్రైపాడ్, స్పైనల్ సపోర్ట్, రోలేటర్ తదితర పరికరాలను ఎంపీ జి.వి.ఎల్ నరసింహారావు సహకారంతో అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులను గుర్తించేందుకు మంగళవారం నుంచి మార్చి 5వ తేదీ వరకు ఎనిమిది శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 27న పెదజాలారిపేట, జీవీఎంసీ స్కూల్ ప్రాంగణం, 28న పోర్ట్ స్టేడియం, వెలమపేట, 29న గాజువాక కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్–రామాలయం దగ్గర, మార్చి 1న ఎస్.కోట జీవీపీ మెడికల్ సెంటర్, మార్చి 2న భీమిలి ఫుట్‌బాల్ మైదానం(తగరపువలస), మార్చి 3న కైలాసపురం డీఎల్‌బీ మైదానం, మార్చి 4న గోపాలపట్నం హై స్కూల్, మార్చి 5న గురుదేవ చారిటబుల్ ట్రస్ట్(మంగళపాలెం)లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. లబ్ధిదారులు తమ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డ్ జిరాక్స్, తెల్ల రేషన్ కార్డ్, ఆదాయ ధ్రువపత్రం(నెలకు రూ.15 వేలకు మించకుండా) తీసుకురావాలన్నారు. అర్హులైన వారు ఈ శిబిరాలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

స్విమ్మర్ గ్రీష్మిణికి బంగారు పతకం



విశాఖ స్పోర్ట్స్: విశాఖ స్విమ్మర్ వి.నాగగ్రీష్మిణి ఖేలో ఇండియా యూనివర్సిటీల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణాలను అందుకుంది. 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ అంశంలో 34.78 సెకన్లలో పూర్తి చేసి బెస్ట్ టైమింగ్‌తో పాటు విజేతగా నిలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. వంద మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ అంశాన్ని 1.17 నిమిషాల్లో పూర్తి చేసి స్వర్ణాన్ని అందుకుంది. 200 మీటర్ల ఫ్రీస్టయిల్ రిలే, 100 మీటర్ల మిడ్లే రిలేలో జట్టు కాంస్యాలను అందుకుంది. ఈ రెండు అంశాల్లోనూ గ్రీష్మిణి జట్టు తరఫున రిలేల్లో పాల్గొంది. ఈ పోటీలు అసోంలోని గౌహతిలో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు జరిగాయి.

జేకేసీకి 239 వినతులు


వినతులు స్వీకరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం (జేకేసీ) కార్యక్రమంలో 239 వినతులు అందినట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. రెవెన్యూకు 96, జీవీఎంసీకి 68, పోలీస్ విభాగానికి 24, ఇతర విభాగాలకు 51 ఫిర్యాదులు అందాయన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో జేకేసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జేకేసీ కార్యక్రమంతో అర్జీదారులు వేగంగా ప్రయోజనం పొందాలని, ఆ దిశగా అధికారులు పనిచేయాలన్నారు. జిల్లాలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్– 2 పరీక్ష విజయవంతంగా ముగిసిందని, ఇందుకు కృషి చేసిన జిల్లా అధికారులను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో కె.మోహన్ కుమార్, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, డీఎల్‌వో ఆర్.పూర్ణిమాదేవి, జీవీఎంసీ ఏడీసీ వర్మ, పోలీస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో అర్జీలు పరిష్కరించాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్, అదనపు కమిషనర్

డాబాగార్డెన్స్: నిర్ణీత సమయంలో అర్జీలను పరిష్కరించాలని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలను ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడతున్న డయల్ యువర్ మేయర్‌కు 13, జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 104 ఫిర్యాదులు అందాయన్నారు.

మూడు రోజుల్లో అర్జీలు పరిష్కరించాలని అధికారులను మేయర్, కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు కేఎస్ విశ్వనాథన్, డాక్టర్ వి.సన్యాసిరావు, డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు పలువురు అధికారులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్ పీఈటీని కఠినంగా శిక్షించాలి

మహిళా చేతన డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న మహిళా చేతన ప్రధాన కార్యదర్శి పద్మ

డాబాగార్డెన్స్: మధురవాడలోని నారాయణ స్కూల్ పీఈటీని కఠినంగా శిక్షించాలని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ డిమాండ్ చేశారు. నారాయణ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసే సంఘటనలు చోటు చేసుకోవడం విచారకరమన్నారు. అత్యాచార చట్టం 376కి వచ్చిన సవరణలు, సుప్రీంకోర్టు నిబంధనలను అనుసరించి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సంస్థ, విద్యాలయాల్లోనూ స్త్రీలు, బాలికల లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేస్తున్నారా? అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని కలెక్టర్లు పర్యవేక్షించాల్సి ఉందన్నారు. ఏడాదికోసారి ఆయా సంస్థలు కలెక్టర్లకు నివేదికలు ఇవ్వాల్సి ఉంటుందని, ఇది ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి నారాయణ స్కూల్‌లో జరిగిన ఘటనపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని పద్మ డిమాండ్ చేశారు. జరిగిన ఘటనకు నారాయణ స్కూల్ యాజమాన్యమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

తండ్రి మందలించాడని మనస్తాపంతో యువకుడి మృతి


అనిల్‌కుమార్ (ఫైల్)

కూర్మన్నపాలెం : పనిచేసి కుటుంబానికి సాయపడమని ఓ తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఈ మేరకు దువ్వాడ సీఐ ఎర్రం నాయుడు తెలిపిన వివరాల ప్రకారం మంగళపాలెం ప్రాంతానికి చెందిన గొన్న శ్రీనివాసు, లక్ష్మి దంపతులు కూరగాయలు పండిస్తూ వాటిని విక్రయిస్తూ జీవనం గడుపుతున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు గొన్నాబత్తుల హేమంత్ చదువు పూర్తి చేసి ఫార్మాసిటీలో పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు అనిల్‌కుమార్ (25) ఐటీఐ చదువుకుని ఖాళీగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో చిన్న కుమారుడు అనిల్‌కుమార్‌ను ఎన్నిరోజులు ఖాళీగా ఉంటావు.. ఉద్యోగం చూసుకుని కుటుంబానికి సాయపడాలని తండ్రి శ్రీనివాస్ మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికొచ్చిన తల్లిదండ్రులు అనిల్‌కుమార్ అచేతనంగా పడి ఉండడంతో సమీప ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ అనిల్‌కుమార్ మృతి చెందాడు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

8 నుంచి స్టీల్‌ప్లాంట్‌లో బయోమెట్రిక్


స్టీల్‌ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మిషన్లు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు, కాంట్రాక్ట్ కార్మికులకు మార్చి 8వ తేదీ నుంచి బయోమెట్రిక్ అటెండెన్స్ రికార్డింగ్ సిస్టం (బార్స్)ను అమలు చేయనున్నారు. ఈ మేరకు యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి దశ అమలులో భాగంగా జనవరిలో స్టీల్‌ప్లాంట్‌లోని అన్ని కార్యాలయాల్లో బార్స్ అమలు చేశారు.వారికి వారం రోజుల పాటు అప్పటికే ఉన్న డైలీ అటెండెన్స్ రికార్డింగ్ సిస్టం (డార్స్)తో పాటు బార్స్ ట్రయల్ రన్ చేశారు. ఫిబ్రవరి 1 నుంచి డార్స్ తొలగించి పూర్తిగా బార్స్ అమలు ప్రారంభించారు. మిగిలిన వర్క్స్ సిబ్బందికి రెండో దశలో బార్స్ అమలుకు యాజమాన్యం సన్నద్ధం అవుతోంది. ఇందులో భాగంగా యుద్ధప్రాతిపదికన మెషిన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. అదే రోజు నుంచి కాంట్రాక్ట్ కార్మికులకు బయో మెట్రిక్ అమలు చేయాలంటూ కాంట్రాక్టర్లకు యాజమాన్యం నిర్దేశించింది.

కార్మిక సంఘాల వైఖరి ఏంటి...

ప్లాంట్‌లో బయోమెట్రిక్ అమలుపై ఈనెల 24న ఉక్కు యాజమాన్యం సమావేశం ఏర్పాటు చేసి సహకరించాలని కోరింది. దీనిపై కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్లాంట్‌లో క్యాంటీన్లు, మంచి నీరు, భద్రతా పరిస్థితులు, కార్మికులకు వేతన సవరణ అమలు వంటి సమస్యలు పరిష్కరించిన తర్వాతే బయోమెట్రిక్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అయినప్పటికీ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేయడం కార్మిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

స్వదేశీ ఉత్పత్తులు కొనుగోలు చేద్దాం

నటి రష్మీ


రినీ స్టోర్‌ను ప్రారంభిస్తున్న నటి రష్మీ

బీచ్‌రోడ్డు: స్వదేశీ ఉత్పత్తులను యువత ఆదరించాలని నటి, యాంకర్ రష్మీ గౌతమ్ పిలుపునిచ్చారు. సీఎంఆర్ సెంట్రల్‌లో రినీ కాస్మోటిక్స్ ఉత్పత్తుల స్టోర్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వదేశీయంగా.. మన శరీరాలకు తగ్గ కాస్మోటిక్స్‌ను రినీ సంస్థ తయారు చేస్తోందన్నారు. నేరుగా స్టోర్‌కు వచ్చి.. మన శరీరానికి సరిపడేట వాటిని పరిశీలించుకుని కొనుగోలు చేయవచ్చన్నారు.ఆన్‌లైన్‌తో ఆర్డర్ చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో రినీ సౌత్ జోన్ హెడ్ గురురాజ్, సీఎంఆర్ జీఎం లింగమూర్తి పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో సత్తాచాటిన శ్రీహాన్

విశాఖ స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి స్పీడ్ స్కేటింగ్ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖకు చెందిన స్కేటర్ శ్రీహాన్ రెండు కాంస్యపతకాలను సొంతం చేసుకున్నాడు. కాకినాడలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ అంతర్జాతీయ ఇండోర్ స్కేటింగ్ హాల్‌లో ఈనెల 24, 25వ తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో 5–7 ఏళ్ల విభాగంలో పోటీపడిన తొలిసారే శ్రీహాన్ సత్తాచాటాడు.

సమస్యలు పరిష్కరించిన వారికే ఓటు


సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మయ్య

డాబాగార్డెన్స్: రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించే వారికే మా ఓటు అడిగే హక్కు ఉందని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీ డబ్ల్యూఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య తెలిపారు. జగదాంబ జంక్షన్ సమీపాన సిటూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రోడ్డు రవాణా డ్రైవర్లకు సామాజిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఉరితాడు వంటి సెక్షన్ 106(1ఐ2), మోటారు ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం 2019, జీవో 21ను రద్దు చేయాలని, ఓలా, ఉబర్ తరహా ప్రత్యామ్నాయ యాప్ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్‌లో పన్ను మినహాయింపు ఇస్తామని చెప్పిన పార్టీలకే మాత్రమే ఓటు అడిగే హక్కు ఉంటుందని చెప్పారు. జిల్లా మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.జగన్, అధ్యక్షుడు శివ, కార్యదర్శి అప్పలరాజు, క్యాబ్ యూనియన్ నాయకుడు శ్రీనివాస్, పోలినాయుడు, ఆటోరిక్షా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ కేరళ, తమిళనాడు, పశ్చిమ బంగా, ఢిల్లీ రాష్ట్రాల తరహాలో సమగ్ర సంక్షేమ చట్టాన్ని చేయాలని, వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేయాలని సిటూ డిమాండ్ చేస్తుందన్నారు.

యువకుని ఉన్నత విద్యకు దివీస్ రూ.10 లక్షల సాయం



శివశంకర్‌కు రూ.10 లక్షల చెక్కు అందిస్తున్న దివీస్ జీఎంలు కోటేశ్వరరావు, ఎంఎస్ఎన్ రావు

తగరపువలస : భీమిలి మండలం అన్నవరం పంచాయతీకి చెందిన మత్స్యకార యువకుడు మూగి శివ శంకర్ ఉన్నత విద్యాభ్యాసానికి దివీస్ లేబొరేటరీ యాజమాన్యం సోమవారం రూ.10 లక్షల సాయం అందించింది. లండన్‌లోని నార్త్ ఆంబ్రియా విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ బిగ్ డేటా సైన్స్ కోర్సులో అవకాశం లభించినా ఆర్థిక స్తోమత లేకపోవడంతో శివశంకర్ దివీస్ సాయం కోరాడు. దీనిపై స్పందించిన జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, ఎం.ఎస్.ఎన్.రావు యువకునికి సాయం చేస్తూ చెక్కు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మేరుగు ఎల్లాజీ, నరసింగరావు, దివీస్ ప్రతినిధులు డి.సురేష్ కుమార్, ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారావు చిరంజీవి

- రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్
- అవయదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు


అంబులెన్స్ నుంచి విమానాశ్రయంలోకి తరలిస్తున్న గుండె, లివర్

గోపాలపట్నం/శ్రీకాకుళం రూరల్: బ్రెయిన్‌డెడ్ అయిన శ్రీకాకుళం జిల్లాలోని పలాసకు చెందిన కిల్లి ధర్మారావు(28) అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఆయన ఈ నెల 24న కంచిలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే స్థానికులు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం ఆయనను బ్రెయిన్ డెడ్‌గా గుర్తించారు. అంతబాధలో కూడా ధర్మారావు కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. జీవన్ దాన్ స్వచ్ఛంద సంస్థను సంప్రదించారు. దీంతో జెమ్స్‌లోనే అవయవాలను వేరు చేసి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గుండెను తిరుపతి స్విమ్స్‌కు, ఊపిరితిత్తులను సికింద్రాబాద్ కిమ్స్‌కు, లివర్, ఒక కిడ్నీను వైజాగ్ కిమ్స్‌కు, కళ్లను శ్రీకాకుళం రెడ్‌క్రాస్‌కు అందజేశారు. కుటుంబ సభ్యులను జెమ్స్ ఆస్పత్రి యాజమాన్యం అభినందించింది. గ్రీన్‌ఛానల్ ద్వారా విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి అవయవాలను తరలించినట్లు ఆర్ఎంఓలు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, బాల మురళీ తెలిపారు.

విజయవంతంగా పారాడ్రాప్ విన్యాసాలు


పారాడ్రాప్ విన్యాసాలు చేస్తున్న నేవీ సిబ్బంది

బీచ్‌రోడ్డు: ఇండియన్ నేవీ అరేబియా సముద్రంలో సీ–130 విమానాల నుంచి పారా డ్రాప్ విన్యాసాలను ప్రదర్శించింది. గల్ఫ్ ఆఫ్ అడెన్ అండ్ అరేబియా సముద్ర భద్రతా పరిస్థితులకు ప్రతిస్పందనగా తక్షణ చర్యలకు కోసం కార్యకలాపాలను నిర్వహించింది.

నేడు కేంద్ర సహాయ మంత్రి రాక

బీచ్‌రోడ్డు: కేంద్ర పోర్ట్స్, షిప్పింగ్ సహాయ మంత్రి నాయక్ మంగళవారం నగరానికి రానున్నారు. ఆయన ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి 12 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి ఏఎంటీజెడ్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు.

నేడు ఇండోనేషియా అంబాసిడర్ రాక

బీచ్‌రోడ్డు: మూడు రోజుల పర్యటన నిమిత్తం ఇండోనేషియా అంబాసిడర్ కృష్ణమూర్తి మంగళవారం నగరానికి రానున్నారు. ఆయన రాత్రి 8 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా బీచ్‌రోడ్డులోని గ్రాండ్ బే హోటల్‌కు వెళ్తారు. రాత్రికి అక్కడే విశ్రాంతి తీసుకుంటారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నేవీ షిప్స్, డాక్‌యార్డును సందర్శిస్తారు. తిరిగి హోటల్‌కు చేరుకొని విశ్రాంతి తీసుకుంటారు. 29న ఉదయం 7 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని విమానంలో తిరుగు ప్రయాణం అవుతారు.